క్లుప్తంగా

క్రీడలతో స్నేహభావం పెంపు



ట్రోఫీ అందజేస్తున్న ఎస్సై రమేష్‌గౌడ్

రామడుగు: క్రీడలతో స్నేహభావం పెరుగుతుందని రామడుగు ఎస్సై రమేష్‌గౌడ్ తెలిపారు. మండలంలోని కోరటపల్లి గ్రామంలో ఆదివారం మన్నె సహృదయ్ స్మారక గ్రామస్థాయి క్రికెట్ పోటీల ముగింపు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. యువత క్రీడలతో పాటుగా సామాజిక సేవ కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన జట్లుకు ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోల రమేశ్, నాయకులు జూపాక మునీందర్, శ్రీకాంత్‌రెడ్డి, టోర్నీ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

చెంజర్లలో 'గావ్ చలో'



పథకాలను వివరిస్తున్న బీజేపీ నాయకులు

మానకొండూర్: మండలంలోని చెంజర్ల గ్రామంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను నాయకులు వివరించారు. గావ్ చలో అభియాన్(పల్లెకు పోదాం రా)లో భాగంగా నాయకులు గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో పూజలు చేశారు. అనంతరం ఎరువుల దుకాణాన్ని సందర్శించి, ఎరువులపై ఇస్తున్న సబ్సిడీని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి అప్పని తిరుపతి, సహాయకులు సింగిరెడ్డి రమణారెడ్డి, మోర్చా ప్రధాన కార్యదర్శి అశ్విని, బూత్ అధ్యక్షుడు సదానందం, ఆదిమూలం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్న సేవా సంస్థ ప్రతినిధులు

రామడుగు: మండలంలోని వెంకట్రావుపల్లికి చెందిన అనాథ బాలికలకు ఆదివారం గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన శ్రీలక్ష్మీనరసింహస్వామి స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు రూ.7,500 అందజేశారు. తల్లిదండ్రులు మృతిచెందడంతో అనాథలైన దైవాల అక్షయ, కృషితను ఆదుకోవడానికి దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు దాసరి కనకయ్య, గౌరవ అధ్యక్షుడు హన్మంతరెడ్డి, మధురెడ్డి, దాసరి రవిశాస్త్రి, పలువురు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్



గంగాధర: మండలంలోని గర్శకుర్తి గ్రామ శివారులో నుంచి అక్రమంగా ఇసుక, మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేశామని ఎస్సై పుల్ల అభిలాశ్ తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక, మట్టి తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. పట్టుకున్న ట్రాక్టర్లను సీజ్ చేయడంతో పాటు డ్రైవర్లపై కేసులు నమోదు చేశామన్నారు.

ప్రదర్శనలతో విషయ పరిజ్ఞానం పెరుగుతుంది



విద్యార్థులతో మాట్లాడుతున్న శ్రీపాల్ రెడ్డి

చొప్పదండి: ప్రదర్శనలతో విద్యార్థులలో విషయ పరిజ్ఞానం పెరుగుతుందని, తరగతి గదులే విద్యా ప్రగతికి సోపానాలని సిద్ధార్థ విద్యా సంస్థల అధినేత దాసరి శ్రీపాల్ రెడ్డి అన్నారు. పట్టణంలోని సిద్ధార్థ విద్యాలయంలో ఆదివారం వివిధ అంశాలపై విద్యార్థుల ప్రదర్శనలను తిలకించారు. ప్రతి అంశంపై విద్యార్థులు సంపూర్ణమైన అవగాహన కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, టీచర్లు, కోఆర్డినేటర్ పాల్గొన్నారు.

'బీఆర్ఎస్‌కు ఓటమి తప్పదు'

కరీంనగర్‌కార్పొరేషన్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్‌కు ఓటమి తప్పదని కాంగ్రెస్ పార్టీ నాయకుడు ప్యాట రమేశ్ అన్నారు. ఆదివారం నగరంలోని డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పది సంవత్సరాల తన హయాంలో బీఆర్ఎస్ అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిందన్నారు. ప్రజలు మరోసారి గుణపాఠం చెబుతారని తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం



చొప్పదండి: ఆర్నకొండలో గురువులతో పూర్వ విద్యార్థులు



శంకరపట్నం: కన్నాపూర్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో..

చొప్పదండి: మండలంలోని ఆర్నకొండ ప్రభుత్వ పాఠశాల 1984–85 ఏడో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. విద్యాబోధన చేసిన నసీరుద్దీన్, దూస లక్ష్మీనర్సయ్యను ఘనంగా సన్మానించారు. అనంతరం పాఠశాలకు బీరువాను విరాళంగా బహూకరించారు. ఒకరికొకరు యోగక్షేమాలను తెలుసుకుంటూ ఆనందంగా గడిపారు. ఎస్ఎంసీ చైర్మన్ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని కన్నాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2008–09 పదో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరికొకరు యోగక్షేమాలను తెలుసుకుంటూ చదువుకున్న రోజులనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అలాగే విద్యాబోధన చేసిన నాటి ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సత్కరించారు.

ప్రైవేటుకు దీటుగా బోధన చేయాలి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల సిబ్బంది

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర: ప్రైవేటు కాలేజీలకు దీటుగా బోధన చేసి విద్యార్థులను ఉత్తములుగా తీర్చి దిద్దాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచించారు. మండలంలోని మధురానగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించే బాధ్యత తీసుకుంటానని గతంలో ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈమేరకు నిర్వాహణ కోసం ఆదివారం రూ.30 వేలు కళాశాల ప్రిన్సిపాల్ ప్రమీలకు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేను కళాశాల సిబ్బంది సన్మానించారు. విద్యార్థులకు సిబ్బంది సొంత ఖర్చులతో అల్పాహారం అందజేయడం అభినందనీయమని ఎమ్మెల్యే అధ్యాపకులను ప్రశంసించారు. విద్యార్థుల భవిష్యత్ గురువుల చేతుల్లో ఉంటుందని వారికి క్రమశిక్షణపై అవగాహన కల్పించాలన్నారు.

దుర్గాభవానీ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

పట్టణ శివారులోని దుర్గాభవాని ఆలయంలో ఎమ్మెల్యే ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. రెవెల్లి గ్రామంలో జరుగుతున్న పోచమ్మ బోనాల మహోత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఆలయ నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజ, కోమటిరెడ్డి, ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, పద్మాకర్‌రెడ్డి, ముద్దం తిరుపతిగౌడ్, చీకట్ల లచ్చయ్య, రాజేశం, సత్యప్రసన్న, అశోక్, గంగయ్యగౌడ్, తిరుపతి, రంగయ్య, సుధాకర్‌గౌడ్, చందు, మణిశంకర్ రెడ్డి, ఆదిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నియామకం



నియామకపత్రం అందిస్తున్న కుమారస్వామి

శంకరపట్నం: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడిగా మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన దేవనూరి అంకుష్, గౌరవ అధ్యక్షుడిగా చెరుకు వెంకటేశంగౌడ్ నియామకమయ్యారు. ఈమేరకు ఆదివారం మండల కేంద్రంలో ఫోరం జిల్లా చైర్మన్ కనకం కుమారస్వామి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఫోరం రాష్ట్ర చైర్మన్ సీమ శ్రీనివాస్, జిల్లా చైర్మన్‌కు అంకుష్, వెంకటేశం కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యకారులు కనబోయిన తిరుపతి, రాచమల్ల శ్రీనివాస్, రంగు శ్రీనివాస్, వడ్లాల శ్రీనివాస్, అలవాట కోటీ, పచ్చిమట్ల సుధాకర్, నిమ్మశెట్టి వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

అర్చకుల సమస్యలు పరిష్కరించాలి

హుజూరాబాద్: అర్చకుల సమస్యలను పరిష్కరించాలని ధూపదీప నైవేద్య అర్చక సంఘం మండలాధ్యక్షుడు బస్మాని శంకరయ్య, ప్రధాన కార్యదర్శి కాయకంటి రాజేశ్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో అర్చకుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సైతం సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అర్చకులు ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించేందుకు 5న జిల్లా కేంద్రంలోని దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌ను కలిసేందుకు అన్నిప్రాంతాల నుంచి అర్చకలు తరలి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు నందనం జగదీశ్వర్, సహాయ కార్యదర్శి కోటగిరి ప్రవీణ్‌కుమార్,కోశాధికారి తనుగల రామకృష్ణశర్మలు ఉన్నారు.

ఒత్తిడి లేకండా పరీక్షలు రాయాలి



మాట్లాడుతున్న సంపత్‌రావు

జమ్మికుంట: విద్యార్థులు ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని జమ్మికుంట ట్రస్మా మండల అధ్యక్షుడు డాక్టర్ పుల్లూరి సంపత్‌రావు, సైకాలజిస్ట్ రవికాంత్ అన్నారు. పట్టణంలోని పీవీఆర్ గార్డెన్‌లో ట్రస్మా మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు మోటివేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జీవితంలో ఉన్న శిఖరాలకు చేరుకోవాలంటే చదువుతోపాటు సంస్కారం అవసరమని, తల్లిదండ్రులు, గురువులు, పెద్దలను గౌరవించాలన్నారు. భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను అవలంబిస్తున్న ఆధునిక జీవన నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర సలహాదారు యాదగిరి శేఖర్‌రావు, అంజిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు కోరెం సంజీవారెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ముసిపట్ల తిరుపతిరెడ్డి, మండల విద్యాధికారి విడుపు శ్రీనివాస్, విర్నేని సుధాకర్‌రావు, బెన్ని, రఘుపతిరెడ్డి, రమణారెడ్డి,కృష్ణారెడ్డి, సునిల్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ చొప్పదండి అధ్యక్షురాలిగా స్వప్న



స్వప్నను అభినందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చొప్పదండి: కాంగ్రెస్ పార్టీ చొప్పదండి మండల మహిళా అధ్యక్షురాలిగా ఆర్నకొండకు చెందిన చిలుముల స్వప్నను నియామకం చేసినట్లు జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నారెడ్డి తెలిపారు. ఈమేరకు ఆర్నకొండ గ్రామ అధ్యక్షుడు ఎల్లాల ఆదిరెడ్డి, రెడ్డి సంఘం అధ్యక్షుడు కేతిరెడ్డి మణిశంకర్‌రెడ్డి, జక్కుల అనిల్, సంతోశ్, జనార్దన్, రమేశ్, శ్రీధర్, పర్శరాం, కనుకేశ్, అజయ్, గోవర్దన్‌రెడ్డి, దాసు, సుమంత్‌లు స్వప్నను అభినందించారు.

నేడు బీఆర్ఎస్ సన్నాహక సమావేశం



మాట్లాడుతున్న రసమయి బాలకిషన్

మానకొండూర్: రాబోయే ఎంపీ ఎన్నికల్లో బోయినపల్లి వినోద్‌కుమార్ గెలుపే ధ్యేయంగా సోమవారం నిర్వహించే బీఆర్ఎస్ సన్నాహక సమావేశం విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మానకొండూర్‌లో ఆదివారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావుతో కలిసి మాట్లాడారు. తిమ్మాపూర్ మండలం అల్గునూర్‌లోని లక్ష్మీనర్సింహస్వామి గార్డెన్‌లో నిర్వహించే సమావేశానికి ఎమ్మెల్యే హరీశ్‌రావు, బోయినపల్లి వినోద్‌కుమార్ హాజరవుతున్నారని తెలిపారు. బండి సంజయ్‌కుమార్ ఎంపీగా ఉండి నిధులు తీసుకురాలేదని విమర్శించారు. సమావేశంలో జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, సర్పంచ్ రొడ్డ పృథ్వీరాజ్, సీనియర్ నాయకులు శాతరాజు యాదగిరి, ఎరుకల శ్రీనివాస్‌గౌడ్, బొయిని వెంకటేశ్, గంగుల రవి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక



కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ బండి సంజయ్‌కుమార్

రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామ మాజీ సర్పంచ్ పెద్దిగారి ఎల్లయ్య, కొండ శ్రీనివాస్, రుద్ర నితీశ్ ఆదివారం బీజేపీలో చేరారు. కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల ప్రభాకర్‌యాదవ్, ఉప్పు శ్రీనివాస్, కాడె నర్సింగం, నవీన్, రాంచందర్‌రావు, ప్రకాశ్, సాగర్, దిలీప్, పలువురు పాల్గొన్నారు.

గన్నేరువరంలో పంటల పరిశీలన



వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

గన్నేరువరం: గన్నేరువరంలో వరి పంటలను ఆదివారం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం జగిత్యాల అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు పి.గోన్యానాయక్, బలరాం, వెంకటేశ్వర్‌రావు, అధిపతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరిలో మొగిపురుగు, అగ్గి తెగులు ఆశించి నష్టం కల్గుజేస్తుందని గుర్తించారు. మొగిపురుగు నివారణకు నాటు వేసిన 10 నుంచి 15 రోజుల్లో కార్బోఫ్యురాన్ 3జీ గుళికలను ఎకరానికి 10 కిలోలు లేదా హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు ఎకరానికి 8 కిలోలు లేదా క్లోరాంత్రనిలిప్రోల్ 0.4జి గుళికలు 4 కిలోల చొప్పున 20–25 కిలోల ఇసుకలో కలిపి చల్లుకోవాలని సూచించారు. అగ్గి తెగులు నివారణకు ట్రైసైక్లోజెల్ ఎకరానికి 120 గ్రాములు పిచికారీ చేయడంతోపాటు ఇతర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో రైతులు బాలయ్య, లక్ష్మీపతి, లక్ష్మయ్య, పుల్లెల జగన్మోహన్, పుల్లెల రాము, ముత్యం అంజయ్య పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జిగా సంపత్



హుజూరాబాద్: పట్టణానికి చెందిన తిప్పారపు సంపత్ యూత్ కాంగ్రెస్ పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జిగా నియామకమయ్యారు. ఈసందర్భంగా సంపత్ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేస్తామన్నారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి, రాష్ట్ర ఇన్‌చార్జి సురభి దివేది, రమేశ్‌బాబులకు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన రాంబాబు



వొడితెల ప్రణవ్‌తో రాంబాబు

హుజూరాబాద్: తెలంగాణ ఉద్యమకారుడు, సోలార్ తెలంగాణ టోపీతో ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్న సామాజిక కార్యకర్త, పట్టణానికి చెందిన సాధుల (తెలంగాణ టోపీ) రాంబాబు ఆదివారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈసందర్భంగా ప్రణవ్ పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. పదేళ్లుగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలవాలన్న ఆకాంక్ష నెరవేరకపోవడం, బీఆర్ఎస్ నాయకుల విధానం సహించలేక అధికార కాంగ్రెస్‌లోకి చేరుతున్నట్టు రాంబాబు తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకుడు ఎర్ర కుమార్ ఉన్నారు.

నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు



పెద్దపాపయ్యపల్లిలో తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణం

హుజూరాబాద్‌రూరల్: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సాహించి వారిని వెలుగులోకి తీసుకు రావాలనే ఉదేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పంచాయతీల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. శాసన సభ ఎన్నికల కోడ్‌కు ముందుగానే స్పోర్ట్స్ కిట్లను హడావుడిగా పంపిణీ చేసింది. కానీ అవి ఇప్పుడు గ్రామ పంచాయతీల్లో మూలుగుతున్నాయి. వాటికి సంబంధించి ఎలాంటి మార్గదర్శకాలు జారీ చేయకపోవడంతో వాటిని ఎక్కడా ఉపయోగించటం లేదు. అప్పట్లో ఎండీపీవోల ద్వారా గ్రామ పంచాయతీలకు వీటిని అప్పజెప్పింది. ఒక్కో కిట్‌లో వాలీబాల్, క్రికెట్, ఎక్సర్‌సైజ్ చేసేందుకు సంబంధించిన డంబుల్స్ ఇతర సామగ్రిని ఇచ్చారు. వాటిని ఉపయోగించుకుంటే యువతకు, విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది ఎక్కడా వినియోగంలోకి రాలేదు. వీటి కోసం రూ. లక్షలు ఖర్చు చేశారు. క్రీడా ప్రాంగణానికి ఒక్క కిట్టు చొప్పున ఇచ్చారు. వీటిని ఉపయోగించకుండా ఉంటే పక్కదారి పట్టే అవకాశం ఉంది. సర్పంచ్‌ల పదవి కాలం సైతం ముగియడంతో వాటి భద్రతపై నీలినీడలు అలుముకున్నాయి. పెద్ద ఎత్తున చేపట్టిన క్రీడా ప్రాంగణాలు బోర్డులకే పరిమితమవుతున్నాయి. మొదట్లో వీటి అమలుకు కొన్ని నిధులను ఖర్చు చేశారు చాలా చోట్ల పాఠశాలల ఆవరణల్లో రాళ్లను తొలగించి మైదానాలుగా మార్చారు. మరికొన్ని చోట్ల గ్రామాలకు కొద్ది దూరంలో వీటిని ఏర్పాటు చేశారు. కానీ చాలా చోట్ల అనువు గాని స్థలాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. పశువుల పాకలు, రాళ్ల రప్పలు ఉన్న చోట్ల, గ్రామాలకు దూరంగా ఉన్న చోట్ల ఏర్పాటు చేయటంతో ఉపయోగపడటం లేదు. అన్ని చోట్ల క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసినట్లుగా అధికారులు చెప్పుకొంటున్నారు. ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉందనేది చూడటం లేదు.

బీసీ సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

కరీంనగర్: బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన టేబుల్ క్యాలెండర్‌ను ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మీసేవ కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. బీసీ సమస్యల పరిష్కారం కోసం నా వంతు కృషి చేస్తానని తెలిపారు. దేశంలో బీసీల కుల గణన కోసం పార్టీ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి కోడూరి పర్శరాంగౌడ్ , జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్, మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరకొండ సంతోషి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

గన్నేరువరం: మండలంలోని జంగపల్లి, గుండ్లపల్లి 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లలో పరిధిలో సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా కరెంట్ సరఫరా నిలిపివేయనున్నామని ఏఈ ఆంజనేయులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. జంగపల్లి, మాదాపూర్, హన్మాజిపల్లె, మార్గంపల్లి, గోపాల్‌పూర్, పీచుపల్లి, గుండ్లపల్లి, గునుకులకొండాపూర్, చీమలకుంటపల్లి, చొక్కాలపల్లి, మోత్కులపల్లి, తుమ్మవానిపల్లెలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

తిమ్మాపూర్: మండలంలోని నల్లగొండ, నుస్తులాపూర్, రేణికుంట సబ్‌స్టేషన్ల పరిధిలో ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ అరవిందరెడ్డి తెలిపారు. విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు. నల్లగొండ సబ్ స్టేషన్ పరిధిలోని నల్లగొండ, మొగిలిపాలెం, పర్లపల్లి, పోలంపల్లి, బాలయ్యపల్లి, మక్తపల్లి, నర్సింగాపూర్,గ్రామాలలో నుస్తులాపూర్ సబ్ స్టేషన్ పరిధిలోని నుస్తులాపూర్, రామకృష్ణ కాలనీ, కొత్తపల్లి, ఇందిరానగర్ గ్రామాలలో, రేణికుంట సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో విద్యుత్ నిలిపి వేస్తామని వివరించారు.

సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు స్పందన

కరీంనగర్‌స్పోర్ట్స్: నగరంలోని అంబేడ్కర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు విశేష స్పందన లభించింది. సుమారు 161 బాలురు, 97 మంది బాలికలు పాల్గొన్నారు. ఇందులో ఎంపికై న క్రీడాకారులు ఈనెల 16వ తేదీ నుంచి 19వ తేదీ వరకు సూర్యాపేట జిల్లాలో జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గొని కరీంనగర్ జిల్లాకు మంచి పేరు తీసుకరావాలని కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సీహెచ్.సంపత్‌రావు తెలిపారు. అసోసియేషన్ సభ్యులు సుధాకర్, కరుణాకర్, పద్మ, పీఈటీలు రాజేందర్‌రెడ్డి, హరికృష్ణ, రమేశ్, మల్లేశ్, రఘుపతి, పుష్పలత, మోహన్ పాల్గొన్నారు.

ముగిసిన సబ్ జూనియర్ అథ్లెటిక్ పోటీలు



కరీంనగర్‌స్పోర్ట్స్: నగరంలోని క్రీడా పాఠశాలలో గల సింథటిక్ ట్రాక్‌పై 8, 10, 12, 15 సంవత్సరాల బాలబాలికలకు నిర్వహిస్తున్న సబ్ జూనియర్ అథ్లెటిక్ పోటీలు ఆదివారం ముగిశాయి. సుమారు 400 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు లేక్ పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ సురేశ్ బహుమతులు అందజేశారు. ప్రతిభ కనబర్చిన 25 మంది క్రీడాకారులను ఈనెల 10న భద్రాద్రి కొత్తగూడెంలో జరిగే రాష్ట్ర పోటీలకు పంపనున్నట్లు అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవి తెలిపారు.